క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

డోన్: స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని ఆలయంలో వెలిసిన కనకదుర్గ అమ్మవారికి భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు



సీసీ రోడ్డు నిర్మించేందుకు గ్రావెల్‌తో చదును చేసిన దృశ్యం

కొలిమిగుండ్ల: స్థానిక ఎమ్మార్పీ కార్యాలయం సమీపంలోని బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్ వద్ద ఉండే కాలనీకి సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దారి ఇరువైపులా కంపచెట్లు తొలగించి శుభ్రం చేశారు. శుక్రవారం గ్రావెల్ వదిలి చదును చేయించారు. జిల్లా పరిషత్ నుంచి రూ.15 లక్షలు నిధులు మంజూరు చేయడంతో సీసీ రోడ్డు ఏర్పాటు చేయనున్నారు. కాలనీలో 30కి పైగానే నివాసాలు ఉన్నాయి. సరైన రోడ్డు సౌకర్యం లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవాళ్లు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పనులు చేపట్టారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

డోన్ టౌన్: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రాయపరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ నెల 6వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు iti.a p.g-o-v.i n వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ప్రింట్‌తో పాటు సర్టిఫికెట్స్ జతపరిచి సమీప ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు.

ఐటీఐలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల కళాశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తుచేసుకోవాలని బేతంచెర్ల ఐటీఐ ప్రిన్సిపల్ సూరప్ప తెలిపారు. 2023–24 సంవత్సరం ఐటీఐలో చేరాలనుకునే విద్యార్థులు డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ.ఐటీఐ. ఏపీ. జీఓవీ. ఇన్ వెబ్‌సైట్ లో జూన్ 6లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శాశ్వత ప్రాతిపదికన పదోన్నతులు ఇవ్వాలి

కోవెలకుంట్ల: ఉపాధ్యాయులకు శాశ్వత ప్రాతిపదికన పదోన్నతులు ఇవ్వాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ ఏ ప్రభుత్వ శాఖలో లేని వి ధంగా ఉపాధ్యాయులకు రూ.2,500 అదనపు అలవెన్స్ ఇచ్చి స్కూల్ అసిస్టెంట్లుగా తాత్కాలిక పద్ధతిన పదోన్నతులు కల్పిస్తున్నారన్నారు. దీంతో వారికి భవిష్యత్‌లో వర్తించే పీఆర్సీ, పెన్షన్,తదితర చేకూర్చే విషయంలో నష్టం జ రుగుతుందన్నారు. అలా కాకుండా అర్హులందరికీ శాశ్వత పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

హైజినిక్ కిట్ల పంపిణీ



బాలికలకు హైజినిక్ కిట్లను పంపిణీ చేస్తున్న ఖాదర్‌బాషా

కోవెలకుంట్ల: స్థానిక చైల్డ్‌ఫండ్ ఇండియా ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం బాలికలకు హైజినిక్ కిట్లను పంపిణీ చేశారు. ఆ సంస్థ దత్తత గ్రామాలైన బిజనవేముల, అమడాల, ముదిగేడు గ్రామాలకు చెందిన 40 మంది బాలికలకు డెటాల్ లిక్విడ్, డోటాల్ సోప్, నాప్‌కిన్‌తో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ఫీల్డ్ కో ఆర్డినేటర్ ఖాదర్‌బాషా మాట్లాడుతూ కౌమార దశలో బాలికలు ఆరోగ్యం ప ట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది మహేష్, ఉసేని, చెన్నయ్య, అంగన్‌వాడీ కార్యకర్త కృపావతమ్మ పాల్గొన్నారు.

ఈ–కేవైసీ చేయించుకోవాలి

కొలిమిగుండ్ల: పీఎం కిసాన్‌కు సంబంధించి ఈ–కేవైసీ చేయించుకోని రైతులు చేసుకోవాలని ఏఓ పవన్‌కుమార్ సూచించారు. శుక్రవారం కొలిమిగుండ్లలోని ఆర్బీకేలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24కు సంబంధించి వైఎస్సార్ రైతు భరోసా అర్హుల జాబితాను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించామని, రైతులు తమ పేర్లను పరిశీలించుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఎరువులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారిణి పద్మావతి, వ్యవసాయ సహాయకులు వనిత, సందీప్, స్నేహ, చంద్ర, శ్రీధర్ పాల్గొన్నారు.

వైద్య సేవలు మెరుగు!

- డోన్ ప్రభుత్వాసుపత్రిలో శస్త్ర చికిత్సలు
- నాలుగు నెలల వ్యవధిలో 35 ఆపరేషన్‌లు చేసిన వైద్య బృందం
- కర్నూలుకు వెళ్లాల్సిన అవసరం లేదంటూ భరోసానిస్తున్న డాక్టర్లు
- సంతోషం వ్యక్తం చేస్తున్న రోగులు, ప్రజలు



రోగులకు వైద్య సేవలు చేస్తున్న డాక్టర్లు (ఫైల్)

డోన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. ఆరోగ్యశ్రీ పరిధిని పెంచడంతోపాటు గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. అదేవిధంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు గ్రామాలకు వెళ్లి నేరుగా వైద్య సేవలు అందజేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యసేవలు అందేస్తున్నారు డాక్టర్లు. ఈ నేపథ్యంలో డోన్ ప్రభుత్వాసుపత్రి స్థాయి 30 పడకల నుండి 100 పడకలకు పెంచింది ప్రభుత్వం. గుత్తి రోడ్డులో ఆసుపత్రి భవన నిర్మాణం జరుగుతుంది. అయితే పాతపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో ప్రస్తుతం 15 మంది డాక్టర్లను నియమించడం జరిగింది. దీంతో వైద్య సేవలు మెరుగుపడ్డాయి. ప్రతి నెలా 200 మందికి పైగా గర్భిణులకు ప్రసవాలు ఈ హెల్త్‌సెంటర్‌లో చేస్తున్నారు కూడా. ఉన్న వసతులతోనే వైద్య బృందం ఏకంగా అరుదైన శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేస్తూ రోగుల మన్ననలు పొందుతున్నారు. ఇటీవల ఒక మహిళ మణికట్టు పూర్తిగా తెగిపోగా ఆర్థో, సివిల్ సర్జన్, అనేస్థిషియా వైద్యుల బృందం శస్త్ర చికిత్స చేశారు. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే 35 రకాల శస్త్ర చికిత్సలను నిర్వహించినట్లు సివిల్‌సర్జన్ డాక్టర్ తజ్ముల్ హుసేన్, ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ సయ్యద్ అహ్మద్ గౌస్‌పీర్ తెలిపారు. మునుముందు ఏ రోగి కర్నూలుకు వెళ్లాల్సిన అవసరం ఉండదంటున్నారు. వైద్య సేవలు మెరుగు పడడంతో రోగులతోపాటు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



డోన్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్

రూ.30కోట్లతో డోన్ ఆసుపత్రి నిర్మాణం

డోన్ ప్రభుత్వాసుపత్రి స్థాయి 30 పడకల నుంచి 100 పడకలకు పెంచిన ప్రభుత్వం స్థానిక గుత్తి రోడ్డులో రూ. 30 కోట్లుతో కొత్త ఆసుపత్రి భవన నిర్మాణం చేపట్టింది. ఈ మేరకు భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అత్యాధునిక వసతులతో భవన నిర్మాణం జరుగుతుంది. కర్నూలు ప్రభుత్వాసుపత్రికి దీటుగా వసతుల కల్పించనున్నారు. దాదాపు మూడొంతుల పనులు పూర్తయినట్లు సమాచారం.

అప్పుల పాలయ్యేవాళ్లం

చిన్నచిన్న శస్త్ర చికిత్సలకోసం కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించి మాలాంటి పేదలెందరో అప్పులపాలయ్యారు. నాకు కడుపులో చిన్న సైజు కనితి (గడ్డ) ఉందని నిర్ధారణ కావడంతో కర్నూలులోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి ఒక డాక్టర్ రెఫర్ చేశారు. అయితే డోన్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నయాపైసా ఖర్చులేకుండా విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించారు.

– లక్ష్మీనరసమ్మ, పాతపేట, డోన్.

వైద్యులు....ప్రాణదాతలు

ప్రమాదశాత్తు కుడి చేతి నరాలు తెగి, ఎముకలు విరిగి పోవడంతో వెంటనే డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వారు శస్త్ర చికిత్స కోసం కర్నూలుకు వెళ్లమని చెప్పకుండా ధైర్యగా శస్త్ర చికిత్స చేసి అవిటితనం రాకుండా కాపాడగలిగారు. డోన్ ఆసుపత్రి వైద్యులను ప్రాణదాతలు. వారి సాయం జీవితాంతం గుర్తించుకుంటా.

– భాగ్యమ్మ , హుశ్శేనాపురం , ప్యాపిలి మండలం.

24 గంటలు వైద్య సేవలు



స్థానిక ప్రభుత్వాసుపత్రిలో 24 గంటలు సేవలు చేసేందుకు వైద్యులు సిద్ధంగా ఉన్నారు. అవకాశం మేరకు అన్నిరకాల ఆపరేషన్లు ఇక్కడే నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం సౌకర్యాలు సమకూర్చడంతోపాటు వైద్యుల సహకారంతోనే ఆపరేషన్లు చేస్తున్నాం. సాధ్యమయ్యేంత వరకు అన్ని రకాల శస్త్రచికిత్సలు ఇక్కడే నిర్వహించేందుకు తమవంతు కృషి చేస్తాం.

– డాక్టర్ ఎస్ఎండి హనీఫ్, ఆసుపత్రి సూపరింటెండెంట్

శివాలయంలో పాము



పామును పట్టుకున్న దృశ్యం

డోన్ : పట్టణ పోలీసుస్టేషన్ సమీప సాంబ శివాలయంలో శుక్రవారం నాగుపాము(జెర్రి పోతు) హల్‌చల్ చేయడంతో పోలీసులు, సబ్ జైల్ సిబ్బంది, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. పోలీసుస్టేషన్, సబ్‌జైల్‌కు మధ్య ఉన్న సాంబ శివాలయంలోకి పాము చొరబడడం చూసిన కొందరు పోలీసులకు సమాచారం అందించడంతో పాములు పట్టే శ్రీను అనే వ్యక్తిని రప్పించారు. అతను చాకచక్యంగా పామును పట్టుకొని వెంకటాపురం చెరువు ప్రాంతంలో పామును సురక్షితంగా వదిలిపెట్టి వచ్చారు.

నాటుసారా విక్రేతల అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లెలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. చాకలి మద్దిలేటి అనే వ్యక్తి నాటు సారా విక్రయిస్తుండగా 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. అలాగే పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన సాలూరి లింగేశ్వరావు నాటుసారా విక్రయిస్తుండగా లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పట్టణంలోని ఎరుకలి పేటలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు సీఐ ప్రీతం రెడ్డి శుక్రవారం తెలిపారు. కాలింగిరి అర్జున్ అనే వ్యక్తి మద్యం విక్రయిస్తుండగా అతని వద్ద నుంచి 12 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సత్తా చాటిన పెద్దకొట్టాల వృషభాలు



పోటీలను ప్రారంభిస్తున్న బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని న్యూ కేటగిరి విభాగంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు.నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు నిర్ణీత సమయంలో 4,050 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో రూ. లక్ష కైవసం చేసుకున్నాయి. బేతంచెర్ల మండలం గోర్లగుట్ల రాజేంద్రనాథరెడ్డి వృషభాలు 4,002 అడుగులు, గోస్పాడు మండలం జిల్లెల్లకు చెందిన రవితీన్సరెడ్డి వృషభాలు 3,831 అడుగులు, సంజామల మండలం కానాల గుండం చెన్నారెడ్డి వృషభాలు 3,751 అడుగులు, ప్యాపిలి మండం పీఆర్‌పల్లె శివకోటి యాదవ్ వృషభాలు 3,412 అడుగుల దూరం లాగి తర్వాతి స్థానాల్లో రూ. 80 వేలు, రూ. 60వేలు, రూ. 40 వేలు, 20 వేలు దక్కించుకున్నాయి. బహుమతులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, రైడర్స్‌క్లబ్, తిరునాల కమిటీ, మాధవరెడ్డి, మహేంద్ర షోరూం, గువ్వల రవికుమార్‌రెడ్డి ఆర్థిక సహకారంతో ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, కోవెలకుంట్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జున రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఆలయ ధర్మకర్త రాంభూపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార దుకాణాల తనిఖీ

బేతంచెర్ల: పట్టణంలోని వివిధ వ్యాపార దుకాణాలను శుక్రవారం డోన్ డివిజన్ తూనికల కొలతల ఇన్‌స్పెక్టర్ కేఎస్ ఖాజా తనిఖీ చేశారు. కిరాణ, వస్త్ర, కూల్ డ్రింక్స్ తదితర దుకాణాలను పరిశీలించారు. నిబంధనలు పాటించని కూల్ డ్రింక్స్, వస్త్ర దుకాణాల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. కూల్ డ్రింక్స్ అధిక ధరలకు అమ్ముతుండటంతో రూ. 5వేల జరిమానా విధించారు. మొబైల్ షాపు, వస్త్ర దుకాణంలో ఎమ్మార్పీ ధర, తయారీ అడ్రస్, ట్యాక్స్, నెల, సంవత్సరం, కంజూమర్ నంబర్ లేకపోవడంతో అవగాహన కల్పించి కేసు నమోదు చేసినట్లు కేఎస్ ఖాజా తెలిపారు.

అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి

ప్యాపిలి: వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఎంపీపీ గోకుల్ లక్ష్మి తెలిపారు. స్థానిక రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. అయితే ఆ పథకాల్లో రైతులు లబ్ధి పొందాలంటే సంబంధిత అధికారులు చిత్త శుద్ధితో పనిచేయాలన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క రైతు కూడా సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్నారు. ఖరీఫ్ సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు సాగు చేయాల్సిన పంటల గురించి, యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో చేపడుతున్న చెరువులకు నీరు నింపే కార్యక్రమం త్వరలోనే పూర్తి కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ అశోక్ వర్ధన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి షేక్షావలి, ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు చంద్రన్న

డోన్ : వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రైతాంగానికి అన్నివిధాలుగా అండగా నిలుస్తుందని మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు చంద్రన్న తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహామండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకముందే రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను రైతుభరోసా కేంద్రాల ద్వారా సకాలంలో అందజేస్తామన్నారు. ఏఓ అబ్దుల్‌షఫీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ రైతుభరోసా సాయం ఈనెలాఖరు లేదా జూన్ మొదటి వారంలో విడుదల చేస్తుందన్నారు. మండల పశువైద్యశాఖ అధికారి డాక్టర్ షా పశువులకు గాలికుంటు వ్యాధితో పాటు వడదెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

సంక్షేమ పథకాలతో రుణం తీర్చుకుంటాం

- అర్హులందరికీ న్యాయం చేస్తాం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: ప్రజలు మంచి మనసుతో ఆశీర్వదించి ఇచ్చిన అవకాశాన్ని ఎన్నటికీ మర్చిపోలేమని, సంక్షేమ పథకాలు అందించి రుణం తీర్చుకుంటామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేసి న్యాయం చేస్తామన్నారు. మండలంలోని సుంకేసులలో శుక్రవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాటసాని తిరుపాల్‌రెడ్డి, ఎంపీడీఓ ఆజాంఖాన్, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి కుటుంబానికి జరిగిన మేలు గురించి వివరించి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఏఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తే, సీఎం వైఎస్ జగన్ మాత్రం ఇచ్చినవాటితోపాటు ఇవ్వని హామీలను అమలు చేసి చూపించారని కొనియాడారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ పాలన తేడాను గమనించాలని కోరా రు. కార్యక్రమంలో డీటీ ప్రసాద్‌బాబు, ఏఈలు ఫక్కీరయ్య, కరిముల్లా గౌస్, ఏపీఎం విజయ్‌గోపాల్, అవుకు మండల సచివాలయ కన్వీనర్ తల్లం సుబ్రహ్మణ్యం, గ్రామ నాయకులు కైప పార్థసారధిరెడ్డి, పాల నాగేశ్వరరెడ్డి, చిన్న తులసిరెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, గుర్విరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నారపురెడ్డి, చల్లా చరణ్‌రెడ్డి, వెంకటచౌడయ్య, ప్రతాప్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామచంద్రుడు, రాజేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆరా

సుంకేసులలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఎస్సీ కాలనీకి చేరుకోగానే సీసీ రోడ్డు తగ్గ ఉండటంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరంతా నిల్వ చేరి నడిచేందుకు వీలు లేకుండా పోయింది. కాలనీ వాసులు అడగక ముందే ఎమ్మెల్యే సచివాలయ సిబ్బందితో చర్చించారు. ,ఎన్ని మీటర్ల సిమెంట్ రోడ్డు అవసరం పడుతుంది...ఎంత ఖర్చు అవుతుందని ఆరా తీశారు. రోడ్డు వేయించండని పలువురు మహిళలు ఎమ్మెల్యేను కోరగా అతి త్వరలోనే సీసీ రోడ్డు వేసి మళ్లీ ప్రారంభోత్సవానికి వస్తానని హామీ ఇచ్చారు. పలువురు ఇళ్ల స్థలాలు,రేషన్ కార్డులు,పింఛన్‌లు కావాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను గ్రీవెన్స్‌లో పెట్టాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

మహిళకు గాయాలు

బేతంచెర్ల:పట్టణంలోని బనగానపల్లె రైల్వే గేటు కూడలి వద్ద బైక్‌ను, స్కార్పియో వాహనం ఢీ కొన్న సంఘటనలో పరమేశ్వరి అనే మహిళకు గాయాలయ్యాయి. పట్టణంలోని సంజీవనగర్‌కాలనీకి చెందిన పరమేశ్వరి తన కూతురు బైకుపై వెళ్తుండగా బనగానపల్లె నుంచి వస్తున్న స్కార్పియో ఢీ కొట్టింది. స్థానికులు ఆమెను వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



వీల్ చైర్‌ను అందజేసిన కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లెరూరల్: దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు కాటసాని ఓబుల రెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే కాటసాని స్వగృహంలో బనగానపల్లె పట్టణానికి చెందిన ఇద్దరికి, మీరాపురం, గుళ్లదుర్తి గ్రామాలకు చెందిన మరో ఇద్దరు దివ్యాంగులకు వీల్ చైర్లను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాటసాని ఓబులరెడ్డి చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాటసాని ఓబులరెడ్డి మాట్లాడుతూ వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, వారికి ఎలాంటి సహకారం కావాలనాన అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు అత్తార్ అఖిల్, బబ్లు, సలీం, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న, రాజేష్

డోన్: ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం 26వ వార్డులో రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల వినతుల మేరకు ప్రాధాన్యత ప్రకారం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని చైర్మన్ గుర్తు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రత్నమ్మ, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుప్రసాద్, కౌన్సిలర్ మహేశ్వరరెడి, నాయకులు రవిరెడ్డి, పండు, గోపిరెడ్డి, గోవిందరాజులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్‌టౌన్:ప్యాపిలి మండలంలోని నల్లమేకలపల్లి 33కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులనేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు హుస్సేనాపురం, పీఆర్ పల్లి, కొచ్చెర్వు సబ్ స్టేషన్లకు కరెంటు నిలిపి వేస్తున్నట్లు ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగేకృష్ణగిరి మండలం అలంకొండ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆలంకొండతోపాటు డోన్ మండలంలోని మల్యాల,యు.కొత్తపల్లె సబ్ స్టేషన్లకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కరెంటు ఉండదన్నారు.అదేవిధంగా పట్టణంలోని ఇందిరా నగర్, తారకరామనగర్, ఆటోనగర్,నెహ్రూనగర్, సుందర్‌సింగ్‌కాలనీలకు కరెంటుసరఫరా ఉండదన్నారు. ఇండస్ట్రియల్ సబ్ స్టేషన్ పరిధిలో వాటర్ వర్క్స్‌ఫీడర్‌మరమ్మతు ల నేపథ్యంలో ఫ్యాక్టరీలకు, చింతలపేట, గోసానిపల్లెకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి ఉదయం 5గంటల నుంచి సరఫరా చేస్తామన్నారు.

వేసవిలోనూ చెరువులు కళకళ!



తిమ్మనాయినపేటలో చెరువులో సమృద్ధిగా నీరు



నాయినపల్లె సమీపంలోని సద్దలవెంగన్న చెరువులో పుష్కలంగా ఉన్న నీరు

కొలిమిగుండ్ల: భానుడు భగభగలాడుతున్నా భూగర్భ జలాల సమస్య ఏ మాత్రం లేదు. వేసవిలోనూ చెరువులు,కుంటలు నీటితో కళకళ లాడుతున్నాయి. తిమ్మనాయినపేట చెరువు, కొలిమిగుండ్ల–నాయినపల్లె సమీపంలోని సద్దలవెంగన్న చెరువుల్లో సమృద్ధిగా నీళ్లు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు బెలుం గుహల సమీపంలోని కుంట, నాయినపల్లె సమీపంలోని కదిరికుంట నీటితో నిండిపోయాయి. వ్యవసాయ, తాగు నీటి బోర్లలో మరింత భూగర్భ జలాలు పెరిగాయి. కుంటల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరడంతో పశుపక్షాదులకు ఉపయోగపడుతున్నాయి.వరుసగా నాలుగేళ్ల పాటు వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. భూగర్భ జలాలకు ఎలాంటి ఢోకా ఉండదని రైతులు పేర్కొన్నారు.